సాక్షి నంద్యాల

శనివారం । 30 । డిసెంబర్ । 2023



భ్రమరాంబకు ఊయల సేవ

శ్రీశైలం: క్షేత్రంలో అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీభ్రమరాంబాదేవికి శుక్రవారం ఊయల సేవను నిర్వహించారు. అలాగే గ్రామదేవత అంకాలమ్మకు కుంకుమార్చనలు చేపట్టారు.



ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

కోసిగి: స్థానిక ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. రికార్డులు సరిగ్గా లేకపోవడంతో రూ.18లక్షల విలువ చేసే అమ్మకాలను నిలిపి వేశారు.



ఓటుహక్కుపై అవగాహన

కౌతాళం: ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో కౌతాళంలో ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంపై ఓటు వేసే విధానాన్ని చూపించారు.

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా ధనుర్మాస పూజలు



ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న అహోబిలం పీఠాధిపతి

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వామితోపాటు శ్రీ గోదాదేవి అమ్మవార్లను దేవాలయం ఎదురుగా ఉన్న యాగశాలలో కొలువుంచి నవకళశ స్థాపన అనంతరం పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం ఉత్సవమూర్తి గోదాదేవి అమ్మవారిని ప్రత్యేక గుడిలో కొలువైన మూల విరాట్ గోదాదేవి అమ్మవారి సన్నిధికి తోడ్కొని వచ్చి కొలువుంచారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ పల్లకిపై ఉభయ దేవేరులతో కొలువైన ప్రహ్లాదవరదుడు మాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. మఠం సమీపంలోకి వచ్చిన ఉత్సవమూర్తులకు పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధానార్చకులు కిడాంబీ వేణుగోపాలన్ ఆధ్వర్యంలో రాపత్తు అధ్యయోనోత్సవం నిర్వహించారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించండి

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ ద్వారా నిర్వహించే పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజును జనవరి 5వ తేదీ నుంచి 19వ తేదీలోపు చెల్లించాలని జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. అపరాధ రుసుం లేకుండా పదో తరగతికి ఒక సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5, పరీక్ష ఫీజు రూ.95 చెల్లించాలన్నారు. ఇంటర్‌కు ఒక సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5, పరీక్ష ఫీజు రూ.145 చెల్లించాల్సి ఉందన్నారు. ప్రాక్టికల్ ఒక్కో సబ్జెక్టుకు రూ.100 చెల్లించాలన్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఇంప్రూమెంట్‌లో థియరీ ఒక్కో సబ్జెక్టుకు రూ.250, ఫెయిల్ అయిన సబ్జెక్టుకు రూ.150 చొప్పున ఫీజు చెల్లించాలన్నారు. మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు పరీక్షల షెడ్యూల్ విడుదల అయ్యిందన్నారు. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు మార్చి 30 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఆన్‌లైన్, ఓపెన్ స్కూల్ కేంద్రాల కో ఆర్డినేటర్ల వద్ద గాని పరీక్ష ఫీజును చెల్లించాలన్నారు. సందేహాలు ఉంటే డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

డీసీఎంఎస్‌లో జన ఔషధి కేంద్రం

- నేడు ప్రారంభం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ప్రధాన కార్యాలయంలో జన ఔషధి కేంద్రం ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ కేంద్రాన్ని శనివారం డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య, జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు ప్రారంభించనున్నారు. ఈ కేంద్రంలో 1,759 రకాల జనరిక్ మందులు, 280 రకాల సర్జికల్ పరికరాలు లభిస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే మందుల ధరలతో పోలిస్తే జన ఔషధి కేంద్రాల్లో జ్వరం, డయాబెటీస్, బీపీ, గ్యాస్, థైరాయిడ్.. ఇలా అన్ని రకాల వ్యాధులకు తక్కువ ధరకే జనరిక్ మందులు లభించనున్నాయి.

మిర్చి.. మిలమిల



కోవెలకుంట్ల సమీపంలో పండు మిరపను కోస్తున్న కూలీలు

గతేడాది లాభాలు చూసిన మిరప రైతులకు ఈ ఏడాది కూడా కలిసొచ్చింది. విక్రయాలకు ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నంద్యాల కేంద్రంగా మిర్చి యార్డు ఏర్పాటు చేయడంతో జిల్లా రైతులు ఆసక్తి చూపి అధిక విస్తీర్ణంలో మిరప సాగు చేశారు. అదే క్రమంలో వాతావరణం అనుకూలించి ఆశాజనకంగా దిగుబడులు ఉండటం.. గిట్టుబాటు ధర ఊరిస్తుండటంతో మిరప రైతుల్లో ఆనందం నెలకొంది.

- దిగుబడులు ఆశాజనకం
- జిల్లాలో 46 వేల ఎకరాల్లో మిర్చి సాగు
- మొదటి కోతలోనే ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి
- ముమ్మరంగా మిరప కోతలు
- ఊరిస్తున్న గిట్టుబాటు ధర

కోవెలకుంట్ల: వర్షాభావ పరిస్థితులు వెంటాడినా.. తెగుళ్ల భయపెట్టినా మిరప రైతులు అన్నింటిని అధిగమించి ఆశాజనకంగా దిగుబడులు సాధించారు. మొదటి కోతలోనే ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తుండటంతో వారి శ్రమకు ఫలితం కనిపిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 24 వేల ఎకరాల్లో మిరప సాగు సాధారణ విస్తీర్ణం కాగా రెట్టింపు స్థాయిలో సాగు చేశారు. బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, కుందూనది, పాలేరు, కుందరవాగు, తదితర సాగునీటి వనరుల ఆధారంగా 46 వేల ఎకరాల్లో సూపర్-10, తేజ, డబ్బీబ్యాడీ, తదితర రకాలకు చెందిన మిరప సాగైంది. దిగుబడులు చేతికందటంతో ఆయా మండలాల పరిధిలో పండు మిరప కోత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గత ఏడాది మిరప సాగు రైతులను అన్ని విధాలుగా గట్టెక్కించడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీనికి తోడు మిరప రైతు కష్టాలు గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నంద్యాల జిల్లా కేంద్రంలో గత ఏడాది మిర్చి యార్డు ఏర్పాటు చేసింది. సాగునీటి వనరులు అందుబాటులో ఉండటం, వాతావరణం అనుకూలంగా మారటం, మిర్చియార్డు అందుబాటులోకి రావటంతో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సాధారణ విస్తీర్ణంలో రెట్టింపు సాగు చేశారు. జిల్లాలోని కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో 18,850 ఎకరాల్లో, నంద్యాల సబ్ డివిజన్‌లో 13,469, నందికొట్కూరులో 6,399, ఆళ్లగడ్డలో 3,830, ఆత్మకూరులో 3,100, డోన్ వ్యవసాయ సబ్ డివిజన్‌లో 6,32 ఎకరాల్లో మిరప సాగైంది. మిరప సాగులో రసాయన ఎరువులు, మిరప నార, క్రిమి సంహారక మందులు, కూలీలు, తదితర రూపంలో ఎకరాకు రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు వెచ్చించాల్సి వచ్చింది. కౌలు రైతులకు కౌలు రూపంలో ఎకరాకు అదనంగా రూ. 40 వేలు భారం పడింది.



అల్వకొండ సమీపంలో మిరప దిగుబడులను ఆరబోసిన దృశ్యం

మొదటి కోతలోనే పది క్వింటాళ్లు

మిరప పంట నెల రోజుల దశలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసినా తర్వాత వరుణుడు కరుణించకపోవడంతో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొన్నారు. మోటార్లు, పైపులు అమర్చుకుని ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, కుందూనది, తదితర సాగునీటి వనరుల ఆధారంగా పది విడతలు సాగునీరు మళ్లించాల్సి వచ్చింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా మిరపను బింగి, జెమిని వైరస్ ఆశించి కాస్త నష్టం చేకూర్చాయి. వీటి బారి నుంచి పంటను రక్షించుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడి పంటను దక్కించుకున్నారు. ప్రస్తుతం పైరు చేతికందటంతో మిరప కోతల పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మొదటి కోతలోనే ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడులు వస్తుండటంతో ఊరట చెందుతున్నారు. మిరపలో రకాలను బట్టి మూడు నుంచి నాలుగు కోతలు వచ్చే సూచనలు ఉండటంతో సూపర్-10, ఇండీస్-5,6,7, ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడులు వచ్చే ఆస్కారం ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆయా మండలాల్లో కోతలు కోసిన మిరప దిగుబడులను కల్లాల్లో ఆరబోసి గ్రేడింగ్ పనులు చేస్తున్నారు. దిగుబడులకు తోడు మార్కెట్‌లో ఎండు మిరపకు గిట్టుబాటు ధర ఉండటంతో పెట్టుబడులు పోనూ ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. హైబ్రిడ్ (బేడిగ) రకాలకు చెందిన మిరప క్వింటాకు మార్కెట్‌లో రూ. 24 వేలు ధర ఉండటంతో దిగుబడులు కాస్త తగ్గినా ఆదాయం చేకూరుతుందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో మిరప సాగు వివరాలు (ఎకరాల్లో)

సబ్ డివిజన్	మిరప సాగు
కోవెలకుంట్ల	18,850
నంద్యాల	13,469
నందికొట్కూరు	6,399
ఆళ్లగడ్డ	3,830
ఆత్మకూరు	3,100
డోన్	6,32
మొత్తం	46,278

11 ఎకరాల్లో సాగు



ఎకరా రూ. 40 వేలు కౌలుకు తీసుకుని ఈ ఏడాది ఖరీఫ్‌లో 11 ఎరకాల్లో మిరప సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, సాగునీరు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 1.50 లక్షల వరకు వెచ్చించాను. ప్రస్తుతం మొదటి విడత కోతకు రావడంతో వారం రోజుల నుంచి మిరప కోతలు జరుగుతున్నాయి.

– సుధాకర్‌రెడ్డి, రైతు, కంపమల్ల, కోవెలకుంట్ల మండలం

కష్టానికి ఫలితం



గత ఏడాదితో పోలిస్తే మిరప సాగులో ఈ ఏడాది పెట్టుబడులు పెరిగాయి. రెండు ఎకరాల్లో మిరపసాగు చేశాను. నాట్లు వేసిన తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాల్లేవు. పంట ఎండిపోకుండా సాగునీటి కోసం మోటార్లు, పైపులు, తదితర వాటి కోసం అదనపు భారం పడింది. సాగునీరు పుష్కలంగా అందించడంతో మొదటి కోతలోనే ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి కనిపిస్తోంది. కష్టానికి ఫలితం దక్కుతుంది.

– కుళాయప్ప, రైతు, అమడాల, కోవెలకుంట్ల మండలం

క్షేత్రస్థాయిలో సూచనలు



ఈ ఏడాది సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో 3,552 హెక్టార్లలో మిరప సాగు సాధారణ విస్తీర్ణం. కాగా ఆయా మండలాల పరిధిలో 7,540 హెక్టార్లలో వివిధ రకాలకు చెందిన మిరప సాగు చేశారు. నారు నాటినప్పటి నుంచి దిగుబడులు చేతి కందే వరకు రైతులకు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందజేశాం. వర్షాభావ పరిస్థితుల్లో బెట్టను తట్టుకునేందుకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాం. రైతులు జిల్లా కేంద్రం నంద్యాల మిర్చి యార్డులో అమ్మకాలు చేసుకోవచ్చు.

– ధరణి, ఉద్యానవన శాఖ అధికారిణి, కోవెలకుంట్ల

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.ఫజుల్ రెహమాన్ శుక్రవారం విడుదల చేశారు. 2023 ఆగస్టులో జరిగిన ఈ పరీక్షలకు 1,404 మంది విద్యార్థులు హాజరుకాగా కేవలం 264 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు(అర్బన్): మాజీ సైనికుల పిల్లలు ప్రధాన మంత్రి ఉపకార వేతన పథకం ద్వారా స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎస్ఆర్ రత్నరూత్ శుక్రవారం పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రొఫెషనల్ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న మాజీ సైనికుల పిల్లలు ఇందుకు అర్హులని తెలిపారు. అర్హులైన వారు www.ksb.gov.in లో జనవరి 1 నుంచి 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముగ్గురికి కరోనా పాజిటివ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులో మరో ముగ్గురికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎఫ్ఎంసీ, మెడికల్ ఓపీలలో 53 మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించారు. ఇందులో బాలాజీనగర్, కల్లూరు, బుధవారపేటలకు చెందిన వారికి కోవిడ్ పాజిటివ్ వచ్చినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

నంద్యాలలో నేడు సామాజిక బస్సు యాత్ర

- హాజరు కానున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాప్రతినిధులు
- సీఎం వైఎస్ జగన్ పాలనలో చేకూరిన మేలును వివరించనున్న నేతలు
- సాయంత్రం 4 గంటలకు గాంధీచౌక్‌లో బహిరంగ సభ



వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలతో కళకళాడుతున్న సామాజిక సాధికార సభ నిర్వహించే గాంధీచౌక్

నంద్యాల: అగ్రవర్ణాలతో సమానంగా అణగారిన వర్గాలు ఎదిగేందుకు సామాజిక న్యాయం లక్ష్యంగా ఎన్నో అవకాశాలు.. బడుగు, బలహీన వర్గాలు పేదరికం నుంచి బయటపడేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు.. ఇది జగనన్న జనరంజక పాలనకు నిదర్శనం. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారు. ఈ నేపథ్యంలో బడుగు, బలహీన వర్గాల వారిని ఆత్మీయంగా పలకరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు చేపట్టిన సామాజిక సాధికార యాత్ర శనివారం నంద్యాలకు రానుంది. ఆయా వర్గాల వారికి వివిధ పదువులు ఇచ్చి సమాజంలో గౌరవం కల్పించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని తరహాలో బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించి హామీలను పక్కాగా అమలు చేశారు. మంత్రి వర్గం మొదలుకొని ఎంపీటీసీ వరకు అన్నింటిలోనూ పెద్దపీట వేశారు. 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి చైర్మన్లుగా, డైరెక్టర్లుగా పదవులు ఇచ్చి చరిత్రలో నిలిచారు. ఆయా వర్గాలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించేందుకు సామాజిక సాధికార బస్సు యాత్రను నిర్వహిస్తున్నారు. శనివారం నంద్యాల పట్టణంలో జరిగే బస్సు యాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. యాత్ర సందర్భంగా గాంధీచౌక్‌లో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. వైఎస్సార్‌సీపీ జెండాలు, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫొటోలు ఉన్న ఫ్లెక్సీలతో పట్టణం శోభాయమానంగా మారింది. సభా ప్రాంగణాన్ని శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు పరిశీలించారు.

బస్సు యాత్ర షెడ్యూల్ ఇలా..

నంద్యాల పట్టణం గాంధీచౌక్‌లో శనివారం జరిగే సాధికార బస్సు యాత్ర సందర్భంగా ముందుగా పట్టణంలోని సూరజ్ హోటల్‌లో 11.30గంటలకు నాయకులు, మేధావులతో సమావేశం, మధ్యాహ్నం 1 గంటలకు విందు, 2 గంటలకు సూరజ్‌హోటల్‌లో పాత్రికేయుల సమావేశం, 3గంటలకు సూరజ్ హోటల్ నుంచి సంజీవనగర్ గేట్, శ్రీనివాససెంటర్ మీదుగా గాంధీచౌక్ వరకు బైక్ ర్యాలీతో బస్సు యాత్ర. 3.20 గంటలకు శ్రీనివాసనగర్ నుంచి గాంధీచౌక్ వరకు పాదయాత్ర, సాయంత్రం 4 గంటలకు గాంధీచౌక్‌లో సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభ ప్రారంభం కానుంది.

హాజరుకానున్న ప్రజాప్రతినిధులు

సామాజిక సాధికార బస్సు యాత్రకు డిప్యూటీ సీఎంలు అంజాద్‌బాషా, నారాయణ స్వామి, మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌తో పాటు జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులతో పాటు ఆయా సామాజిక వర్గాలకు చెందిన నేతలు హాజరు కానున్నారు.



బస్సు యాత్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

అట్టడుగు వర్గాలను ఆర్థిక, సాంఘిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి పథంలో తమ ప్రభుత్వం నడిపించిన వైనాన్ని ప్రజలకు తెలియజెప్పడం కోసమే సామాజిక సాధికార బస్సు యాత్ర. సామాజిక సాధికార బస్సుయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్‌లో జరిగే సామాజిక సాధికారత బస్సు యాత్రకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలి. గ్రామ పంచాయతీ మొదలు శాసన సభ, మండలి వరకు నిర్దేశించిన లక్ష్యాలకు మించి వైఎస్సార్ సీపీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అధికారంలో సింహభాగం అవకాశాలు కల్పించింది. మేనిఫెస్టోలోని 99.05 శాతం పైగా హామీలు పూర్తి చేస్తే అందులో లబ్ధిదారులు జనాభాలో 60 శాతంపైగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలేనన్నారు.

– శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నంద్యాల

పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక భరోసా

- నాల్గో విడత జగనన్న విద్యాదీవెన నిధులు విడుదల చేసిన సీఎం జగన్
- జిల్లాలో 30,199 మంది విద్యార్థులకు లబ్ధి
- విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.21.36 కోట్లు జమ
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



జగనన్న విద్యాదీవెన మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు

నంద్యాల: పేద విద్యార్థుల ఉన్నత చదువుల లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాదీవెన పథకం కింద ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. జగనన్న విద్యా దీవెన 4వ విడత నిధులను శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన బహిరంగ సభ నుంచి బటన్ నొక్కి నేరుగా అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 8.09 లక్షల మంది విద్యార్థులకు రూ.584 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఈ కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్‌జిలానీ శామూన్, జిల్లా జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరక్టర్ శశికళ రెడ్డి, దృశ్య కళ డైరక్టర్ సునీత అమృత రాజ్, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీదేవి, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి విద్యార్థులు, తల్లిదండ్రులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని పేద విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలన్నారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదని, చదువుల ఖర్చుతో తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదన్న ఉద్దేశంతో సీఎం జగనన్న విద్యాదీవెన పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు 14 ఏళ్ల సీఎంగా ఉన్న ప్రజలకు మంచి చేసేందుకు ఆలోచించలేదని, కేవలం అవినీతి కోసమే అధికారాన్ని ఉపయోగించుకున్నారన్నారు. ఆయన హయాంలో కనీసం చెప్పుకోవడానికి ఓ మంచి పథకం కూడా అమలు చేయలేక పోయారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పింఛన్ కానుకను జనవరి 1వ తేదీ నుంచి రూ.3వేలకు పెంచి ఇవ్వబోతున్నారన్నారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా సంక్షేమ పథకాల నిధులను నేరుగా బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో ముఖ్యమంత్రి జమ చేస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్ మనజీర్ జిలానీ మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా 4వ విడతలో జిల్లాలో 30,199 మంది విద్యార్థులకు సంబంధించి 27,504 మంది తల్లుల ఖాతాల్లో రూ.21.36 కోట్లు జమ చేశామన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 5,167 మంది విద్యార్థుల తల్లులకు రూ.3.66 కోట్లు, బనగానపల్లెలో 5,332 మంది విద్యార్థుల తల్లులకు రూ.3.74 కోట్లు, డోన్‌లో 4,264 మంది విద్యార్థుల తల్లులకు రూ.2.92 కోట్లు, నందికొట్కూరులో 4,673 మంది విద్యార్థుల తల్లులకు రూ.3.20 కోట్లు, నంద్యాలలో 5,213 మంది విద్యార్థుల తల్లులకు రూ.4.03కోట్లు, పాణ్యంలో 1,552 మంది విద్యార్థుల తల్లులకు రూ.1.09 కోట్లు, శ్రీశైలంలో 3,998 మంది విద్యార్థుల తల్లులకు రూ.2.68 కోట్లు వెరసి మొత్తం 30,199 మంది విద్యార్థులకు సంబంధించి 27,504 మంది తల్లుల ఖాతాల్లో రూ.21.36 కోట్లు జమ చేశామని కలెక్టర్ వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్, జెడ్పీ చైర్మన్ తదితరుల చేతుల మీదుగా విద్యార్థులు, విద్యార్థుల తల్లులకు మెగా చెక్కును అందజేశారు.

భవిష్యత్‌కు బంగారు బాటలు



నేను శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. ఇప్పటి వరకు మూడు విడతలుగా విద్యా దీవెన కింద రూ.26,250 నా కాలేజీ ఫీజును రీయింబర్స్‌మెంట్ చేయడం సంతోషంగా ఉంది. ఈ పథకం కింద విద్యార్థులకు చదువుల దీవెనలు అందుతున్నాయి. పేదల చదువులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. విద్యార్థులకు ఈ విధమైన సహకారం భవిష్యత్‌కు సైతం భరోసాను ఇస్తున్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– కంబగిరి, బీటెక్ విద్యార్థి, నంద్యాల

విద్యాదీవెనతో ధైర్యం



నేను పట్టణంలోని ప్రైవేటు కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాను. ఈ ఏడాది కాలేజీ ఫీజు మొత్తం కట్టాల్సిన అవసరం రాలేదు. ప్రభుత్వమే జగనన్న విద్యాదీవెన కింద చెల్లిస్తోంది. విద్యాదీవెన పథకం ద్వారా విద్యార్థుల పేదరికాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదోలుతున్నారు. ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. ఈ పథకం వలన మాలాంటి పేద విద్యార్థుల్లో ప్రభుత్వం మానసిక ధైర్యాన్ని నింపింది.

– సుమలత, డిగ్రీ విద్యార్థి నంద్యాల

ఆర్టీసీ అప్రెంటిస్ మెరిట్ లిస్ట్ విడుదల

నంద్యాల టౌన్: ఆర్టీసీలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రికల్, వెల్డర్ అప్రెంటిస్‌షిప్ పోస్టులకు సంబంధించిన మెరిట్ లిస్ట్ విడుదల చేసినట్లు రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. మెరిట్ లిస్ట్ వివరాలు ఆయా ఆర్టీసీ డిపోలలో అందుబాటులో ఉంచామన్నారు. అర్హత పొందిన అభ్యర్థులు పదో తరగతి, ఐటీఐ ఒరిజినల్ మార్క్ లిస్టులతో పాటు ఆరు నెలల లోపు మంజూరు చేయబడిన కుల ధృవీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో కర్నూలులోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో జనవరి 11వ తేదీ హాజరు కావాలని సూచించారు.

శ్రీశైలం నుంచి 4,111 క్యూసెక్కుల నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 4,111 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 1.106 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జునసాగర్‌కు 2,334 క్యూసెక్కుల నీటిని వదిలారు. శుక్రవారం సాయంత్రానికి జలాశయంలో 50.3520 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 830.80 అడుగులకు చేరుకుంది.

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఏపీజీఎల్ఐ ఏడీ గౌరి ప్రసన్న



ఏపీజీఎల్ఐ జేడీ కృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏడీ గౌరి ప్రసన్న

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా (ఏపీజీఎల్ఐ) జాయింట్ డైరెక్టర్ కార్యాలయం అసిస్టెంటు డైరెక్టర్‌గా ఎస్.గౌరి ప్రసన్న శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని ఏపీజీఎల్ఐ డైరెక్టరేట్‌లో సూపరింటెండెంటుగా పనిచేస్తున్న ఈమెకు అసిస్టెంటు డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి కర్నూలుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇంతవరకు ఇక్కడ ఏడీగా పనిచేసిన వెంకటేశ్వర్లు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం గౌరి ప్రసన్న మాట్లాడుతూ.. బీమా పరంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరిస్తానన్నారు. ఆమెను పర్యవేక్షకులు పి.రామకృష్ణారెడ్డి, మాధవి, కళ్యాణి, సిబ్బంది సుభాషిణి, మద్దిలేటి, సౌజన్య, పుష్పవల్లి, శివకుమార్ తదితరులు అభినందించారు.

ఏడుగురు ఉపాధి సిబ్బంది సస్పెన్షన్

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధిలో అవినీతి అక్రమాలకు పాల్పడిన ఏడుగురిపై వేటు పడింది. ఇటీవల పెద్దకడుబూరు మండలంలో 16వ రౌండు ఉపాధి హామీ సామాజిక తనిఖీలకు సంబంధించి ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఇందులో ఉపాధి సిబ్బంది అక్రమాలు వెలుగుచూశాయి. పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో సస్పెన్షన్ వేటు వేసినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. సస్పెండైన వారిలో పెద్దకడుబూరు ఏపీఓ రామన్న, టెక్నికల్ అసిస్టెంటు (టీఏ) భాస్కర్, కంప్యూటర్ ఆపరేటర్‌లు హరికృష్ణ, నిర్మల, హెచ్.మురవని, చిన్నతుంబళం, పీకలబెట్ట ఫీల్డ్ అసిస్టెంట్లు నరసప్ప, బసవరాజు, నరసింహులు ఉన్నారు.

నేటి నుంచి 'పది' రివిజన్ టెస్టులు

కర్నూలు (సిటీ): వచ్చే ఏడాది మార్చి నెలలో జరగనున్న 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ముందస్తు ప్రణాళికలో భాగంగా నేటి (శనివారం) నుంచి రివిజన్ టెస్టులు నిర్వహించనున్నట్లు డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు నాలుగు రివిజన్ టెస్టులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే రివిజన్ క్లాసులు కూడా ప్రారంభించాలన్నారు. ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు రెగ్యులర్‌గా రివిజన్ టెస్టులను పర్యవేక్షించాలన్నారు.

మంత్రి చొరవతో ప్రగతి 'బాట'

- రూ.5.75 కోట్లతో బ్రిడ్జి, బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న పలకూరబండ గ్రామస్తులు



నాడు: పలకూరబండ గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి



నేడు: నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు



నాడు: అధ్వానంగా ఉన్న వంక



నేడు: నూతనంగా నిర్మించిన బ్రిడ్జి



ఆస్పరి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం నెరవేర్చారు. దీంతో పలకూరబండ గ్రామస్తుల కష్టాలు తీరాయి. గతంలో ములుగుందం నుంచి పలకూరబండ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండేది. మధ్యలో పెద్ద వంక కూడా సమస్యగా మారింది. వర్షాకాలంలో వంక పోటెత్తి రాకపోకలు స్తంభించి పోయేవి. ఆస్పత్రులకు రోగులు, గర్భిణులను తరలించాలంటే ఎన్నో అవస్థలు పడేవారు. కర్నూలు, ఆదోని ఆస్పత్రుల్లో అనారోగ్యంతో మరణిస్తే అంబులెన్స్ వంక దాటకపోవడంతో శవాలను ఎద్దుల బండ్లపై గ్రామంలోకి తీసుకొచ్చి పూడ్చి పెట్టేవారు. సమస్యను పరిష్కరించాలని టీడీపీ హయాంలో అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. గత ఎన్నికల సమయంలో గ్రామానికి వచ్చిన గుమ్మనూరు జయరాంకు ప్రజలు సమస్యను విన్నవించారు. తమ ప్రభుత్వం వస్తే పలకూరబండకు బ్రిడ్జి, రోడ్డు వేయిస్తానని జయరాం హామీ ఇచ్చారు. ఆమేరకు ములుగుందం నుంచి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న పలకూరబండకు బీటీరోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.5.75కోట్లు మంజూరు చేయించారు. నిర్మాణ పనులను పూర్తి చేయించారు. దీంతో పలకూరబండ గ్రామస్తులు ఏ సమయంలోనైనా ఎక్కడకు వెళ్లినా సురక్షితంగా గ్రామానికి చేరుకుంటున్నారు. బ్రిడ్జి, బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసినందుకు మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

మేలును మరువం



పెద్దల కాలం నుంచి మా గ్రామ సమీపంలో ఉన్న వంకతో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. వర్షాకాలంలో అయితే మిగతా గ్రామాలకు వెళ్లలేం. ఎన్నో ఏళ్ల నాటి సమస్య మంత్రి గుమ్మనూరు జయరాం పరిష్కరించారు. ఆయన చేసిన మేలును మేం ఎప్పటికీ మరువం. – కనకన్న, పలకూరబండ

ఇబ్బందులు తొలగాయి



గతంలో సరైన రోడ్డు ఉండేది కాదు. వంక దాటడం పెద్ద సమస్యగా మారేది. వర్షాకాలంలో అయితే ఇబ్బందులు మరీ తీవ్రంగా ఉండేవి. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా బ్రిడ్జితో పాటు బీటీ రోడ్డు నిర్మించడం వల్ల ప్రయాణ కష్టాలు తీరాయి. – రంగముని, పలకూర బండ

25 శాతం అదనపు వ్యయంతో 'జీపీడీపీ'

- జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ టీ నాగరాజునాయుడు

కర్నూలు(అర్బన్): ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం చేసిన ఖర్చుకు అదనంగా 25 శాతం జోడించి 2024–25 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ)ను రూపొందించాలని జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు ఆదేశించారు. శుక్రవారం పీఆర్అండ్ఆర్‌డీ అడిషనల్ కమిషనర్ సుధాకర్‌రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. జీపీడీపీని జనవరి 31వ తేదీలోగా సిద్ధం చేయాలని, గ్రామసభ నిర్వహించి సభ్యుల ఆమోదంతో దానిని ఈ– గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామ సభ నిర్వహించేందుకు ముందే ఆయా గ్రామ పంచాయతీల్లో బాలల, మహిళల గ్రామ సభలు నిర్వహించాల్సి ఉందన్నారు. గ్రామ పంచాయతీలతో పాటు మండల, జిల్లా స్థాయిలో కూడా డెవలప్‌మెంట్ ప్లాన్‌ను రూపొందించాల్సి ఉంటుందన్నారు. 2024 ఫిబ్రవరి 28కి మండల పరిషత్ డెవలప్‌మెంట్ ప్లాన్, మార్చి 31వ తేది నాటికి జిల్లా పరిషత్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను సిద్ధం చేయాల్సి ఉందన్నారు. ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధికి వివిధ ప్రభుత్వ శాఖలు చేసే వ్యయాన్ని పొందుపరచాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో కర్నూలు డివిజినల్ పంచాయతీ అధికారిణి తిమ్మక్క, డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ నూర్జహాన్, రిసోర్స్ పర్సన్లు, ఏపీడీఎం తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కండి

- సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెంచండి
- లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేయించండి
- నేర సమీక్షలో క్షేత్రస్థాయి అధికారులకు ఎస్పీ ఆదేశం





నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్, సమావేశంలో పాల్గొన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు

కర్నూలు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున అందరూ సిద్ధంగా ఉండాలని క్షేత్రస్థాయి పోలీసు అధికారులకు ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో శుక్రవారం జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఎస్పీ నేర సమీక్ష నిర్వహించారు. లైసెన్స్ కలిగిన ఆయుధాలను డిపాజిట్ చేయించాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలపై, రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచాలన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి బైండోవర్ చేయాలని, నాటుసారా తయారీ, విక్రయదారులపై నిరంతర దాడులు నిర్వహించాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎస్పీలు ప్రతిరోజూ బైండోవర్, ఎన్‌బీడబ్ల్యూ, ఎన్‌డీపీఎస్ కేసులతో పాటు కేడీలు, సస్పెక్టుల సమాచారం తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వివరాలు, పోలింగ్ బూత్ లొకేషన్, రూట్ మ్యాప్ గురించి ఇతర శాఖల సమన్వయంతో పూర్తిగా సేకరించాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు పెంచుకుని గ్రామాల్లో సమస్యలపై ముందస్తు సమాచారాన్ని సేకరిస్తుండాలన్నారు. ఎలాంటి సంఘటన జరగకుండా ముందస్తు నేర నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. నేర సమీక్షలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు నాగభూషణం, విజయశేఖర్, సుధాకర్ రెడ్డి, శివనారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, సీతారామయ్య, ఇలియాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి విద్యార్థుల పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న విద్యార్థినులు

- జగనన్న విద్యా దీవెన పథకం అమలు చేస్తుండడంతో కృతజ్ఞతలు

కర్నూలు(సెంట్రల్): జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విద్యార్థులు జీవితాంతం గుర్తు పెట్టుకుంటారని వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం భీమవరం నుంచి జగనన్న విద్యా దీవెనను ముఖ్యమంత్రి విడుదల చేయడంతో రాయలసీమ యూనివర్సిటీలో ఆయన చిత్రపటానికి విద్యార్థులు పాలాభిషేకం చేశారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు మాట్లాడుతూ..వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు యువత పెద్ద ఎత్తున మద్దతుగా నిలుస్తుందన్నారు. విద్యార్థుల ఓట్లన్నీ వైఎస్ఆర్‌సీపీకే పడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు అఖిల్, చంటి, రాఘవ, అంకిత, కల్యాణి, విజయ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో నిలిచిన నీటి సరఫరా

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువలో శుక్రవారం నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. ఈ నెల 25న తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీకి నీటి సరఫరాను నిలిపివేశారు. కొద్ది రోజులు పాటు కాలువలో ప్రవాహం కొనసాగాల్సి ఉండగా ఎగువన ఉన్న కర్ణాటక రైతులు నీరు ముందుకెళ్లకుండా కాలువకు అడ్డుకట్ట వేశారు.

సమష్టి కృషితోనే నేరాల నియంత్రణ

- ఎస్పీ రఘువీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: పోలీస్‌శాఖ అధికార యంత్రాగం సమష్టి కృషితో జిల్లాలో నేరాలను నియంత్రించామని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి వివరించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఈ ఏడాది నమోదైన కేసుల వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నేరాల సంఖ్య గణనీయంగా తగ్గించామని పేర్కొన్నారు. గత ఏడాది దోపిడీ కేసులు 17 నమోదు కాగా ఈ ఏడాది పోలీసుల గస్తీ కారణంగా కేవలం ఒక కేసు మాత్రమే నమోదైందన్నారు. దొంగతనాలు గత ఏడాది 296 నమోదు కాగా ఈ ఏడాది 215, సొత్తు కోసం ఈ ఏడాది రెండు హత్య కేసులు నమోదయ్యాయన్నారు. హత్యాయత్నాలు గత ఏడాది 79 కేసులు నమోదు కాగా ఈ ఏడాది వాటి సంఖ్య 37 మాత్రమేనన్నారు. ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులు గత ఏడాది 5, ఈ ఏడాది 10, వర్గాల ఘర్షణలు గత ఏడాది 19 కాగా ఈ ఏడాది ఐదు కేసులు నమోదయ్యాయన్నారు. బాలికలపై పోక్సో నేరాలు గత ఏడాది 30 నమోదు కాగా ఈ ఏడాది 16కు తగ్గిందన్నారు. అదేవిధంగా గత ఏడాది 32 కిడ్నాప్ కేసులు నమోదు కాగా ఈ ఏడాది 18 మాత్రమే నమోదయ్యాయని వివరించారు. ఎస్సీ, ఎస్టీ కేసులు గత ఏడాది 146 నమోదు కాగా ఈ ఏడాది 121 నమోదయ్యాయన్నారు. ఛీటింగ్ కేసులు గత ఏడాది 620 నమోదు కాగా ఈ ఏడాది వాటి సంఖ్య 339కి తగ్గిందన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల్లో గత ఏడాది మృతులు 243 మంది, క్షతగాత్రులు 360 మంది అని, ఈ ఏడాది మృతులు 239 మంది, క్షతగాత్రులు 273 మంది అని వివరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి, ఎస్సీ, ఎస్టీ డీఎస్పీ రామాంజినాయక్, ఎస్బీ డీఎస్పీ సంతోష్, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు



డోన్ ఐటీఐలో వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కేంద్రీయ విద్యాలయం ప్రతినిధి బృందం

డోన్: జిల్లాకు మంజూరైన కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు డోన్ పట్టణంలో తాత్కాలిక భవనాలను శుక్రవారం కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రతినిధుల బృందం పరిశీలించింది. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వసతి గృహ భవన నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఇందులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల వసతికి కూడా అనువైన పరిస్థితులు ఉన్నాయని కర్నూలు కేంద్రీయ విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రంగన్న ఆధ్వర్యంలో బృందం సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయ సంఘటన ముఖ్య కార్యాలయానికి త్వరలోనే నివేదిక పంపుతామని రంగన్న వెల్లడించారు. బృందం వెంట జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి, ఆర్‌డీఓ వెంకటరెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన పీఏ ప్రతాప్‌రెడ్డి, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి, బృందం సభ్యులు హరిప్రసాద్, వెంకటేశ్వర రావు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నం

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నంద్యాల: భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు వచ్చే సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫారమ్‌లు, ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, పోలింగ్ అధికారుల నియామకం, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఈరోల్‌పై రిపోర్టులు, పీఎస్ఈలు, డీఎస్ఈలు, ఈవీఎంల భద్రతా గదులు తదితర అంశాలపై ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఇప్పటి వరకు ఫారం –6, 7, 8 అన్ని దరఖాస్తులు కలిపి మొత్తం 857 పెండింగ్‌లో ఉన్నాయని, వీటన్నింటినీ వెంటనే క్లియర్ చేయిస్తున్నామన్నారు. అలాగే 43 జంక్ క్యారెక్టర్స్ ఉన్నవి, 10 కంటే ఎక్కువ ఓట్లు వున్న 106 కుటుంబాలకు సంబంధించి ఇంటింటి సర్వేలో పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఓటర్ల జాబితాలో సవరిస్తామన్నారు. జిల్లాలో ఉన్న 1,621 పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతుల కల్పనపై పర్యవేక్షించి కొరతగా ఉన్న వాటిపై దృష్టి సారించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున మాస్టర్ ట్రైనర్లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 920 లొకేషన్లలో 15,070 దివ్యాంగ ఓటర్లు ఉన్నారని, వీల్ చైర్ల కొరత ఉన్నట్లు ఎన్నికల ప్రధాన అధికారికి కలెక్టర్ వివరించారు. అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. 18 ఏళ్లు పూర్తయిన వారందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా ఆయా జిల్లాలలోని అన్ని కళాశాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్‌డీఓలు శ్రీనివాసులు, ఎం.దాసు, వెంకటరెడ్డి, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని విద్యార్థులకు గాయాలు



ప్రమాద స్థలంలో కారు, బైక్

శిరివెళ్ల: నంద్యాల – ఆళ్లగడ్డ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. శిరివెళ్లకు చెందిన నాయక్ సోయల్, కటిక హలీఫ్‌లు యర్రగుంట్ల విమలా స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు రహదారిపై వచ్చి నిలబడ్డారు. ఆ సమయంలో మోత్కలపల్లె నుంచి ఆళ్లగడ్డకు వెళ్తున్న బైక్‌పై వెళ్తున్న నరేష్‌ను లిఫ్ట్ అడిగి ఎక్కారు. శిరివెళ్ల మెట్ట దాటిన వెంటనే నంద్యాల నుంచి ఆళ్లగడ్డ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొనింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురు అక్కడే ఉన్న లారీ కింద పడి తీవ్ర గాయాల పాలయ్యారు. వీరిని 108లో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సోయల్ పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు హాస్పిటల్‌కు తరలించారు. కారు టైర్ పేలి అదుపు తప్పి ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

విద్యుత్ చౌర్యంపై కఠిన చర్యలు

- ఈ ఏడాది 9,607 కేసులు నమోదు
- జరిమానా కింద రూ.59.70 లక్షల వసూలు



పార్థసారథిరెడ్డి, ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్‌పీఎస్

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు తనిఖీలు, దాడులను యాంటీ పవర్ థెఫ్ట్ స్క్వాడ్ పోలీస్ స్టేషన్(విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్‌పీఎస్) అధికారులు ముమ్మరం చేశారు. ఇన్‌స్పెక్టర్ డి.పార్థసారథిరెడ్డి ఆధ్వర్యంలో దాడులు ముమ్మరం చేశారు. 2022తో పోలిస్తే 2023లో కేసులు పెరిగినప్పటికీ విద్యుత్ చౌర్యం తగ్గినట్లుగా ఆయన తెలిపారు. 2022లో విద్యుత్ చౌర్యానికి సంబంధించి 5,944 కేసులు నమోదు చేసి రూ.45,05,500 జరిమానాలు వసూలు చేసినట్లు శుక్రవారం ఆయన విలేకర్లకు వెల్లడించారు. 2023లో జనవరి నుంచి డిసెంబర్ వరకు 9,607 కేసులు నమోదు చేసి రూ.59,70,500 జరిమానాల కింద వసూలు చేశామన్నారు. గృహ వినియోగానికి సంబంధించే అత్యధికంగా విద్యుత్ చౌర్యం కేసులు నమోదు అయ్యాయన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్ చౌర్యాన్ని మరింత తగ్గించేందుకు తనిఖీలను ముమ్మరం చేస్తామన్నారు.